క్లుప్తంగా

11న రామాలయ నిర్మాణానికి శంకుస్థాపన

పొదలకూరు: పట్టణంలో రామాలయ నిర్మాణానికి ఈనెల 11వ తేదీన ఉదయం శంకుస్థాపన చేయడం జరుగుతుందని ఉభయకర్తలు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తేదీన రామ భక్తులు పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తారన్నారు. శంకుస్థాపన మహోత్సవానికి భక్తులు తరలిరావాల్సిందిగా కోరారు.

దాతకు సన్మానం



పొదలకూరు: పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రానికి రూ.15 వేలు విలువైన లైటింగ్ నేమ్ బోర్డు అందజేసిన దాత బాబ్జీని సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ యు.ప్రసాద్ మంగళవారం సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

పీహెచ్‌సీ వద్ద నిరసన



పొదలకూరు(ముత్తుకూరు): పదిరోజులుగా సమ్మె చేస్తున్న ఎంఎల్‌హెచ్‌పీలు.. ఏఎన్‌ఎం, సూపర్‌వైజర్లు, హెచ్‌ఈఓల జీతభత్యాలపై చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని ముత్తుకూరు పీహెచ్‌సీ వద్ద మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంఎల్‌హెచ్‌పీలు చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా రెండు రోజులుగా నిరసనలు చేపట్టినట్టు తెలిపారు. ఆశావర్కర్ల సమావేశం సందర్భంగా నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో హెచ్‌ఈఓ శాస్త్రి, పీహెచ్‌ఎన్ ఉష, హెచ్‌ఎస్ కృష్ణంరాజు, నిర్మల, ప్రమీల, బాలకృష్ణ, ఏఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

పోలేరమ్మకు పొంగళ్లు

పొదలకూరు: పట్టణానికి సమీపంలోని శ్రామిక నగర్ గిరిజన కాలనీలో మంగళవారం పోలేరమ్మకు పొంగళ్లు పెట్టారు. పోలేరమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సమ్మెను జయప్రదం చేయాలి



జెండాను ఆవిష్కరించిన నాయకులు

తోటపల్లిగూడూరు: ఈనెల 20వ తేదీన కార్మికులు నిర్వహించే దేశవ్యాప్త సమ్మెను అన్ని వర్గాల వారు జయప్రదం చేయాలని ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి దుగ్గిరాల అన్నపూర్ణమ్మ పిలుపునిచ్చారు. మేడే వారోత్సవాల్లో భాగంగా మండలంలోని వరిగొండ, కోడూరు పీహెచ్‌సీల్లో మంగళవారం సీఐటీయూ జెండాను ఆవిష్కరించారు. మధుసూదనమ్మ, రేణుకమ్మ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం



తోటపల్లిగూడూరు: మండలంలోని వెంకన్నపాళెం మత్స్యకారపాళెంలో సీతారామ కల్యాణం, గ్రామోత్సవాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఈ వేడుకల్లో గ్రామ పెద్దకాపు సామం జి.రామయ్య, కొండూరు వెంకటరమణయ్య, అక్కయ్యగారి ఆదెయ్య, వెంకటేశ్వర్లు, మహేష్ పాల్గొన్నారు.

సేవాభావం పెరుగుతుంది

• కలెక్టర్ ఆనంద్

వెంకటాచలం: ఎన్‌సీసీలో చేరడం ద్వారా విద్యార్థుల్లో సేవాభావం పెరుగుతుందని కలెక్టర్ ఆనంద్ అన్నారు. మండలంలోని అక్షర విద్యాలయంలో 10 ఆంధ్రా నావల్ యూనిట్ ఎన్‌సీసీ నెల్లూరు లెఫ్టినెంట్ కమాండర్ గణేష్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఎన్‌సీసీ శిక్షణ శిబిరాన్ని కలెక్టర్ మంగళవారం రాత్రి సందర్శించారు. ఈ సందర్భంగా శిక్షణ పొందిన క్యాడెట్లకు సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్‌సీసీలో చేరిన విద్యార్థులకు క్రమశిక్షణ, సేవాభావం, దేశభక్తి పెరుగుతుందని చెప్పారు. శిక్షణ సమయంలో విద్యార్థుల్లో దాగి ఉన్న ఉన్న సృజనాత్మకతను వెలికితీసి వారిని ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ లెఫ్టినెంట్ కమాండర్ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

స్థలాలు కేటాయించాలని వినతి

నెల్లూరు(అర్బన్) : ఉద్యోగులు ఇళ్ల నిర్మించుకునేందుకు నెల్లూరులో ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలాన్ని కేటాయించి ప్రభుత్వానికి సిఫార్సు చేయాలని ఏపీ ఎన్‌జీఓ జిల్లా అధ్యక్షుడు మన్నేపల్లి పెంచలరావు కోరారు. ఈ మేరకు కలెక్టర్ ఆనంద్‌కు జిల్లా నాన్ గెజిటెడ్ ప్రభుత్వ అధికారుల హౌస్ బిల్డింగ్ సొసైటీ ఆధ్వర్యంలో పలువురు నాయకులు మంగళవారం వినతి పత్రం అందజేశారు.

రోడ్డెక్కాలంటే నరకమే



చేపల గుంతల కట్టలతో ఆక్రమణలకు గురైన రోడ్డు

విడవలూరు: మండలంలోని ముదివర్తి పంచాయతీ చెలికల నుంచి విడవలూరుకు వెళ్లే పంచాయతీ రోడ్డు రోజురోజుకు ఆక్రమణకు గురవుతోంది. మండల కేంద్రమైన విడవలూరు నుంచి చెలికలకు వెళ్లాలంటే పంచాయతీ రోడ్డుపై దాదాపు మూడు కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి ఉంది. అయితే ఏళ్ల తరబడి ఎవరూ పట్టించుకోకపోవడంతో ఈ మార్గం మట్టిరోడ్డుగానే ఉంది. అసలే సరైన మార్గం లేక నానా తంటాలు పడుతుంటే ఆక్రమణదారులు రోజురోజుకు వారి చేపల గుంతల కట్టలు, పొలం గట్ల కోసం రోడ్డును పూర్తిగా ఆక్రమింజేస్తూ, వాహనాలు కూడా వెళ్లే పరిస్థితి లేకుండా చేస్తున్నారని స్థానికులు వాపోయారు. దీనిపై అధికారులకు ఫిర్యాదులు చేశామని, గతంలో కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దృష్టికి తీసుకెళ్లామని, అయినా కూడా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, ఆక్రమణలను తొలగించాలని కోరుతున్నారు.

బాబోయ్ పందులు



బుచ్చి పట్టణంలో గుంపులుగా తిరుగుతున్న పందులు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : నగర పంచాయతీ పరిధిలోని పలు వార్డుల్లో పందులు స్వైరవిహారం చేస్తూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. అయినప్పటికీ అధికారులు, ప్రజా ప్రతినిధులు సమస్య పరిష్కారానికి ఏమాత్రం పూనుకోవడం లేదు. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా మంగళికట్ట, జగనన్న కాలనీల్లో పందులు గుంపులుగుంపులుగా తిరుగుతుండటంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. పందుల పెంపకందారులకు పునరావాసం చూపించకపోవడంతో వారు జగనన్న కాలనీల్లో పందులను వదిలేస్తున్నారు. దీంతో ఆయా కాలనీల్లో అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి గతంలో పందుల పెంపకందారులకు పునరావాసం విషయంలో ఇచ్చిన హామీ మేరకు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఇంత జరుగుతున్నా నగర పంచాయతీ కమిషనర్ బాలకృష్ణ కనీస చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.

కాలువ పనుల్లో కక్కుర్తి

- ఎల్లవ కాలువలో పూడికతీతకు రూ.8.50 లక్షల మంజూరు
- పైపైనే పూడికతీత పనులు
- ఆవేదన వ్యక్తం చేస్తున్న రైతులు



గొలగమూడి పొలాల మధ్యలో ఎల్లవ కాలువలో పైపైనే చేసిన పూడికతీత పనులు

వెంకటాచలం: అధికారుల పర్యవేక్షణ లేకపోవడం, కాంట్రాక్టర్ల స్వార్థం కారణంగా రైతుల సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించడం లేదు. ఏటా భారీ వర్షాలు కురిసినప్పుడు మండలంలోని గొలగమూడి గ్రామ సమీపంలోని పొలాలు ముంపునకు గురవుతూ రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. పొలాల మధ్యలో ఉన్న ఎల్లవ కాలువ పూడికతో నిండిపోవడం, ముళ్ల చెట్లు ఏపుగా పెరగడం కారణంగా వరద నీరంతా పొలాల మీదుగానే వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో వర్షాలు పడి ఆగిపోయిన నాలుగైదు రోజుల వరకు కూడా పొలాల్లో వరద నీరు బయటకు వెళ్లడం లేదు. దీంతో ఈ ప్రాంత రైతులంతా ఏటా ముందుగా వేసిన వరినాట్లు మునిగిపోవడంతో, రెండో దఫా వరినాట్లు వేస్తూ తీవ్రంగా నష్టపోతున్నారు.

పూడికతీత పనులేవీ?

గొలగమూడిలో ఎల్లవ కాలువ పూర్తిగా పూడిక, ముళ్ల చెట్లతో ఉన్న కారణంగా చుక్కనీరు ముందుకు కదిలే పరిస్థితి లేదని రైతులు తమ గోడును అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో గొలగమూడి నుంచి నక్కల కాలువ వరకు పొలాల మధ్యలో ఉన్న ఎల్లవ కాలువ 4.5 కిలోమీటర్ల దూరం ఉంది. ఇందులో మూడు కిలోమీటర్ల దూరం వరకు ముళ్ల చెట్లు తొలగింపుతోపాటుగా, పూడిక తీసేందుకు ప్రభుత్వం రూ.8.50 లక్షలు మంజూరు చేసింది. ఈ పనులను వారం రోజుల క్రితం మొదలు పెట్టారు. అయితే ముళ్ల చెట్లను మాత్రమే తొలగించి, పూడికతీత పనులు పైపైనే చేసి వదిలేశారు. కొన్నిచోట్ల పనులు చేసిన ఆనవాళ్లు కూడా లేవు. రెండు రోజుల్లో పొక్లెయిన్‌తో పనులు ముగించారంటే పనులు ఏ స్థాయిలో చేశారో ఇట్టే అర్థమైపోతుంది. పనులు చేసే సమయంలో అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కాంట్రాక్టర్ ఇష్టానుసారంగా చేయించారనే విమర్శలున్నాయి. ఎల్లవ కాలువలో పూడికతీత పనులు సక్రమంగా జరగలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముళ్ల చెట్లను తొలగించారే తప్ప, పూడిక పూర్తిస్థాయిలో తీయలేదని ఆరోపిస్తున్నారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని మండిపడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించాలని కోరుతున్నారు.



ముళ్ల చెట్లను మాత్రమే తొలగించిన దృశ్యం

పూర్తి స్థాయిలో పూడిక తీయించేలా చర్యలు

గొలగమూడిలో ఎల్లవ కాలువలో పూర్తి స్థాయిలో పనులు చేసేలా చర్యలు తీసుకుంటాం. పొక్లెయిన్ పనిచేయకపోవడంతో పనులు ఆగి ఉన్నాయి. పూడికతీత విషయంలో రైతులు కొన్ని అభ్యంతరాలు చెబుతున్నారు. పరిశీలించి పనులు పూర్తి స్థాయిలో చేయిస్తాం.

– సుబ్బరాజు, ఇరిగేషన్ డ్రెయిన్ ఏఈ

మొక్కల పెంపకంపై దృష్టి

• పీసీసీఎఫ్ చలపతిరావు



మొక్కలను పరిశీలిస్తున్న చలపతిరావు

వెంకటాచలం: జామాయిల్ మొక్కలు ఏపుగా పెరిగేందుకు అన్ని చర్యలు చేపట్టాలని పీసీసీఎఫ్ డాక్టర్ పీవీ చలపతిరావు సూచించారు. మండలంలోని కసుమూరులో వీఎస్ఎస్ ఆధ్వర్యంలో పెంచుతున్న జామాయిల్, ఎర్రచందం మొక్కలను మంగళవారం పరిశీలించారు. పలుచోట్ల తిరిగి మొత్తం ఎన్ని మొక్కలు పెంచుతున్నా అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎక్కువగా ముళ్ల చెట్లు ఉండటంతో వెంటనే వాటిని తొలగించాలని ఆదేశించారు. ఆయన వెంట గుంటూరు సీసీఎఫ్ రాజు, జిల్లా అటవీశాఖాధికారి మహబూబ్‌బాషా, ఎఫ్ఆర్వో మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

కిశోరి వికాసంపై అవగాహన



పొదలకూరులో ర్యాలీ



మనుబోలు: మాట్లాడుతున్న రమణమ్మ

పొదలకూరు: కిశోరి వికాసం – వేసవి శిక్షణపై అవగాహన ర్యాలీని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్ ఆదినారాయణమ్మ ఆధ్వర్యంలో మంగళవారం యర్రబల్లి, సూరాయపాళెం గ్రామాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జూన్ 10వ తేదీ వరకు శిక్షణను నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు నాగసుధా, చంద్రకళ, జ్యోతి, సునీత, వీఓఏ రమ, హెల్పర్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

⇨ **మనుబోలు:** వ్యక్తిగత పరిశుభ్రతను పాటించడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమణమ్మ అన్నారు. మండలంలోని బద్దెవోలు ఎస్టీ అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం కిశోరి వికాసంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. బాల్య వివాహాలు, బాలికా సంరక్షణ చట్టాలు, పరిసరాల పరిశుభ్రత, గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్ తదితర విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు రాధ, ఉమామహేశ్వరి, దొరసానమ్మ తదితరలు పాల్గొన్నారు.

గ్రంథాలయాల్లో శిక్షణ



కొడవలూరులో చిత్రలేఖనంలో ప్రతిభ చూపిన విద్యార్థులు

మనుబోలు: ధ్యానంతో ఏకాగ్రత పెరుగుతుందని తద్వారా విద్యార్థులు చదువుపై దృష్టి సారించేందుకు వీలవుతుందని పతంజలి యువ భారత్ జిల్లా ఇన్‌చార్జి, యోగా ట్రెయినర్ చెలికం కోటేశ్వర్‌రెడ్డి అన్నారు. గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరం (సమ్మర్ క్యాంప్)లో భాగంగా మంగళవారం విద్యార్థులతో ధ్యానం, యోగాసనాలు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యానికి, మానసికోల్లాసానికి ధ్యానం, యోగా ఉపకరిస్తాయన్నారు. లైబ్రేరియన్ అరుణ్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు విజ్ఞాన శిబిరాలు ఉపయోగపడతాయన్నారు. అంతకుముందు యోగా గురువు పద్మశ్రీ శివానందబాబాకు శ్రద్ధాంజలి ఘటించారు.

యోగా సాధన అవసరం

⇨ **కొడవలూరు :** చిన్ననాటి నుంచే యోగా సాధన అవసరమని లైబ్రేరియన్ జె.సురేంద్రరెడ్డి సూచించారు. వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా మండలంలోని యల్లాయపాళెం గ్రంథాలయంలో విద్యార్థులకు యోగాపై మంగళవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా సాధనతో ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చన్నారు. అనంతరం ఉపాధ్యాయుడు పి.రంగారెడ్డి సులభమార్గంలో గణిత సమస్యలు పరిష్కరించడాన్ని విద్యార్థులకు వివరించారు.

కొడవలూరులో..

వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా స్థానిక గ్రంథాలయంలో విద్యార్థులకు మంగళవారం చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ కె.రాజేశ్వరి మాట్లాడుతూ పాఠ్య పుస్తకాలతో పాటు గ్రంథాలయంలోని పుస్తకాలను చదవడం ద్వారా మేధస్సును పొందవచ్చన్నారు.



మనుబోలు: ధ్యానం చేస్తున్న చిన్నారులు



కొడవలూరు : యల్లాయపాళెంలో..

పోలీసుల తీరు బాధాకరం



మాట్లాడుతున్న ఫయాజ్

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని పోలినాయుడుచెరువు గ్రామానికి చెందిన పెద్ద రఫి హత్య విషయంలో పోలీసులు స్పందించిన తీరు బాధాకరమని మృతుడి అల్లుడు ఫయాజ్ అన్నారు. గ్రామంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తన మామను నాగాయగుంట వద్ద దారుణంగా హత్య చేసిన వారిలో ఎంతమందిని అరెస్ట్ చేశారు, హత్య వెనకాల ఎవరున్నారు.. అనే విషయాలు కూడా తెలపలేదన్నారు. నిందితులపై చర్యలు తీసుకోవడంలో పోలీసులు తీవ్రంగా విఫలమయ్యారన్నారు. తన మామకు ఇద్దరు కుమార్తెలున్నారని, వారి భవిష్యత్ అగమ్యగోచరంగా మారిందన్నారు. కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు.

లీగ్ దశకు సాఫ్ట్‌బాల్ పోటీలు



మ్యాచ్‌లో తలపడుతున్న క్రీడాకారులు

వెంకటాచలం: విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ)లో జరుగుతున్న జాతీయ స్థాయి పురుషుల సాఫ్ట్‌బాల్ పోటీలు లీగ్ దశకు చేరుకున్నాయి. మంగళవారం పలు మ్యాచ్‌లు జరిగాయి. గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ, నెల్లూరులోని విక్రమ సింహపురి యూనివర్సిటీ, మహారాష్ట్రలోని అమరావతి యూనివరిసటీ, ఛత్రపతి శివాజీ మహరాజ్ యూనివర్సిటీలు లీగ్ దశకు చేరుకున్నాయి. పోటీలను వీఎస్‌యూ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత పర్యవేక్షించారు.

గ్రావెల్ అక్రమ రవాణా

• వాహనాల సీజ్



జేసీబీతో తవ్వకాలు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని పెనుబల్లి గ్రామంలోని తిప్ప నుంచి పగలు, రాత్రి తేడా లేకుండా గ్రావెల్ అక్రమ రవాణా జరుగుతోంది. జేసీబీతో తవ్వుతూ ట్రాక్టర్లలో ఇష్టారాజ్యంగా గ్రావెల్ తరలిస్తుండటంతో స్థానికులు మంగళవారం జిల్లా మైనింగ్ అధికారులకు సమాచారమిచ్చారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని జేసీబీ, ట్రాక్టర్లను సీజ్ చేసి బుచ్చిరెడ్డిపాళెం పోలీసులకు అప్పగించారు. గ్రావెల్ మాఫియాను అడ్డుకుంటామని కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి పదేపదే చెబుతున్నా ఎవరూ లెక్కచేయడం లేదు. నియోజకవర్గ వ్యాప్తంగా గ్రావెల్, ఇసుక, మట్టి మాఫియాల వెనుక టీడీపీ నేతలు ఉండటంతో ఆమె చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ప్రచారం జరుగుతోంది.

నేడు కాకాణి రమణారెడ్డి వర్ధంతి

పొదలకూరు: మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి తండ్రి, మాజీ సమితి అధ్యక్షుడైన కాకాణి రమణారెడ్డి వర్ధంతిని బుధవారం ఉదయం 8 గంటలకు పట్టణంలో నిర్వహిస్తామని ఉప సర్పంచ్ వాకాటి శ్రీనివాసులురెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంగం రోడ్డు, మండల కార్యాలయానికి సమీపంలో ఉన్న రమణారెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో రోగులకు పండ్లు, రొట్టెలను అందజేయడం జరుగుతుందన్నారు. కాకాణి స్వగ్రామం తోడేరులో రమణారెడ్డి ఘాట్ వద్ద ఉదయం 8 గంటలకు ఘనంగా నివాళులర్పిస్తామని వైస్ ఎంపీపీ వేణుంబాక చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. కాకాణి అభిమానులు పాల్గొనాల్సిందిగా కోరారు.

హుండీ కానుకల లెక్కింపు రేపు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని జొన్నవాడలో వెలసిన మల్లికార్జున సమేత కామాక్షితాయి ఆలయ హుండీ కానుకల లెక్కింపు గురువారం జరుగుతుందని ఈఓ శ్రీనివాసులురెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి కార్యక్రమం మొదలవుతుందని, భక్తులు హాజరు కావాలని కోరారు.

12న యోగా శిక్షకుని ఎంపికకు ఇంటర్వ్యూలు

కొడవలూరు: యోగా శిక్షకుని ఎంపికకు ఈనెల 12న ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు గండవరం ఆయుర్వేద వైద్యశాల వైద్యాధికారిని గీత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పురుషులు, మహిళలకు వేర్వేరుగా శిక్షకులను నియమించాల్సి ఉందని, మహిళా శిక్షకురాలి నియామకం జరిగి ఉన్నందున పురుషుల శిక్షకుని కోసం ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నామన్నారు. వీరికి గంటకు రూ.250ల వంతున ఆయుష్ శాఖ చెల్లిస్తుందని చెప్పారు. యోగాలో డిప్లొమా, ఎమ్మెస్సీ, పీజీ డిప్లొమా ఉన్న వారికి ప్రాధాన్యమిస్తామన్నారు. ఆసక్తి గల వారు గండవరంలోని ఆయుర్వేద వైద్యశాలలో వచ్చే సోమవారం ఉదయం 9.30 గంటలకు జరిగే ఇంటర్వ్యూలకు హాజరు కావాలని సూచించారు.

గ్రామాల్లో అవగాహన పెంచాలి



వైద్య సిబ్బందికి సూచనలిస్తున్న డీఎంఓ హుస్సేనమ్మ

కొడవలూరు: దోమల వల్ల సంక్రమించే వ్యాధుల పట్ల గ్రామాల్లో అవగాహన పెంచాలని జిల్లా మలేరియా నివారణాధికారిని హుస్సేనమ్మ వైద్య సిబ్బందికి సూచించారు. మండలంలోని యల్లాయపాళెం పీహెచ్‌సీని మంగళవారం ఆమె సందర్శించి వైద్య సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణుల్లో దోమల వల్ల వచ్చే వ్యాధులపై అవగాహన పెరిగితే తగిన జాగ్రత్తలు తీసుకుంటారన్నారు. తొలుత ఆమె పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలించారు. వైద్యాధికారి కామాక్షయ్య, ఎస్‌యూఓ నాగరాజు, హెచ్‌ఈఓ కోటేష్, హెచ్‌ఎస్‌లు రజియా, సురేంద్ర, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.